క్లుప్తంగా

సమయ పాలన పాటించాలి



పెర్కిట్(ఆర్మూర్): వైద్య సిబ్బంది సమయ పాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి అశోక్ సిబ్బందికి సూచించారు. ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నారులకు ఇచ్చే వ్యాక్సిన్ నిల్వలను పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్ల క్యూరింగ్ అదుర్స్



బాల్కొండ: ముప్కాల్ మండలం నాగంపేట్, రెంజర్ల గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లకు సిబ్బంది క్యూరింగ్ చేపడుతున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఎండలు మెండుగా కాస్తున్నాయి. దీంతో ఎంత నీరు పట్టిన వెంటనే ఆరిపోతుంది. దీంతో పసుపు ఆకు, గడ్డి వేస్తూ నీరు పట్టడం వలన క్యూరింగ్ ఎక్కువ సమయం నిల్వ ఉంటుంది. రోడ్ల నాణ్యత దెబ్బతినకుండా ఉంటుంది. దీంతో రోడ్ల క్యూరింగ్ అదుర్స్ అంటూ ప్రజలు పేర్కొంటున్నారు.

ప్రమాదకరంగా మూలమలుపు



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో కొత్తపల్లి నుంచి వచ్చే రోడ్డు పక్కన మూల మలుపు ప్రమాదకరంగా ఉంది. పక్షం రోజుల నుంచి జాతీయ రహదారి 44 బైపాస్ వద్ద అండర్ వే బ్రిడ్జ్ పనులు ప్రారంభం కావడంతో వాహనాలను కొత్తపల్లి రోడ్డు వైపు దారి మళ్లిస్తున్నారు. బస్సులు, పెద్ద పెద్ద వాహనాలు రాకపోకలు కొనసాగించడంతో మూలమలుపు వద్ద ఉన్న కల్వర్ట్ కూలిపోవడంతో ప్రమాదకరంగా మారింది. అధికారులు కనీ సం హెచ్చరిక బోర్డులు కూడ పెట్టకపోవడంతో వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మూలమలుపు వద్ద కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బీజేపీలో పలువురి చేరిక



కమ్మర్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సున్నం మోహన్, కార్యకర్తలు కొడిమ్యాల శేఖర్‌గౌడ్, మల్యాల లక్ష్మణ్‌గౌడ్, కొత్తపల్లి గణేష్‌లు శనివారం బీజేపీలో చేరారు. జిల్లా కేంద్రంలో ఎంపీ అర్వింద్ సమక్షంలో వారు పార్టీలో చేరగా, ఆయన కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు బద్దం రమేష్‌రెడ్డి, చింత ప్రవీణ్, కమలాకర్, సోమ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



కమ్మర్‌పల్లి: బీజేపీతోనే దేశ సమగ్ర అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర నాయకుడు పెద్దోళ్ల గంగారెడ్డి అన్నారు. మండలంలోని చౌట్‌పల్లిలో శనివారం ఆయన 'గావ్ చలో, బస్తీ చలో' కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పథకాల వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. నాయకులు కుంట భూమారెడ్డి, కుందారం శ్రావణ్, నవాతే రంజిత్ కుమార్, గడ్డం అమర్, చిలుకూరి బాజన్న, సిలివేరి రాజ్ కుమార్, క్యాతం దేవేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇసుక డంపులు సీజ్

మోర్తాడ్: అక్రమంగా నిలువ ఉంచిన ఇసుక డంపులను అధికారులు సీజ్ చేశారు. రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమ్‌గల్ మండలంలోని బడాభీమ్‌గల్‌లో అక్రమ ఇసుక డంపులు ఉన్నాయనే విశ్వసనీయ సమాచారంతో రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. మొత్తం 12 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేశారు. ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

ప్లాస్టిక్ సేకరణ కేంద్రాలు ఏవీ?

- గత ప్రభుత్వ హయాంలో ప్రతి జీపీ పరిధిలో ఏర్పాటు
- పట్టించుకునేవారు లేక కనుమరుగైన వైనం



స్వచ్ఛ భారత్ మిషన్ కింద గతంలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ సేకరణ కేంద్రం (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కోసం గత ప్రభుత్వం ప్రతి జీపీ పరిధిలో స్వచ్ఛ భారత్ మిషన్ కింద ఏర్పాటు చేశారు. కానీ పాలకులు, అధికారులు నిర్లక్ష్యం కారణంగా వాటి నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో క్రమేణా కనుమరుగైనాయి. దీంతో గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. కొన్ని రకాల ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిసియే అవకాశం లేనందున పర్యావరణానికి ప్రమాదం పొంచిఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రీసైక్లింగ్ కోసం..

ఎన్నో రకాల ప్లాస్టిక్ సామగ్రిని వృథాగా పడవేసే బదులు రీ–సైక్లింగ్ చేసి ప్రజలకు అవసరమైన సామగ్రిని తయారు చేయాలని గత ప్రభుత్వ హయాంలో ప్లాస్టిక్ సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్లాస్టిక్ కవర్లు, డబ్బాలు, ఇతర సామగ్రిని సేకరించి అందులో రీ–సైక్లింగ్‌కు అవసరమైన సామగ్రిని ఆ సెంటర్లకు పంపించాలని నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో 530(పునర్విభజనకు ముందు) గ్రామ పంచాయతీలు ఉండగా చిన్న పంచాయతీల్లో ఒక్కో సేకరణ కేంద్రం, పెద్ద పంచాయతీలలో జనాభాకు అనుగుణంగా మూడు, నాలుగు ప్లాస్టిక్ సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో సేకరించిన ప్లాస్టిక్ సామగ్రిని వారం, పది రోజులకు ఒకసారి జిల్లా కేంద్రానికి తరలించి అక్కడి నుంచి రీ–సైక్లింగ్ సెంటర్‌లకు చేరవేయాలని నిర్ణయించారు. ప్లాస్టిక్ సామగ్రిని తరలించి, రీ–సైక్లింగ్ చేసే బాధ్యతను ప్రభుత్వం ఐటీసీ కంపెనీకి అప్పగించింది. ఆరంభంలో కొన్ని రోజుల పాటు ప్లాస్టిక్ సామగ్రి సేకరణ కొనసాగింది. మళ్లీ ఈ కార్యక్రమం ముందుకు సాగలేదు. ప్రస్తుతం అనేక పంచాయతీలలో ప్లాస్టిక్ సేకరణ కేంద్రాలు మరుగునపడిపోయాయి. దీంతో ప్రభుత్వం ఆశయం నీరుగారిపోయింది. ప్లాస్టిక్ వ్యర్థాలు వృథాగా పారవేయకుండా రీ–సైక్లింగ్ చేయడం వల్ల పర్యావరణం దెబ్బతినకుండా ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే అంశంపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

కార్యక్రమాన్ని కొనసాగించాలి..



ప్లాస్టిక్ వ్యర్థాలను వృథాగా పారవేయడం వల్ల కాలుష్యం పెరుగుతుంది. అవసరమైన ప్లాస్టిక్ సామగ్రిని రీ–సైక్లింగ్ చేయడానికి అవకాశం ఉంది. ఈ కార్యక్రమంను ప్రభుత్వం కొనసాగించాలి. ప్లాస్టిక్ రీ–సైక్లింగ్ వల్ల మానవాళికి ఎంతో ఉపయోగం కలుగుతుంది.

– గడ్డం చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్, తిమ్మాపూర్

ప్రభుత్వం పునరాలోచించాలి..



పర్యావరణానికి ముప్పును తగ్గించే ప్లాస్టిక్ రీ–సైక్లింగ్ కార్యక్రమాన్ని కొనసాగించాలి. కొత్త ప్రభుత్వం పునరాలోచన చేసి గ్రామాల్లో ప్లాస్టిక్ సామగ్రిని గతంలో మాదిరిగానే సేకరించాలి. ప్రజలు కూడా సహకరించి ప్లాస్టిక్ సామగ్రిని సేకరణ కేంద్రాలకు చేరవేయాలి. రీసైక్లింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలి.

–గంగాధర్‌గౌడ్, తిమ్మాపూర్

ముందుచూపు లేక.. నరికివేత



మోర్తాడ్‌లో విద్యుత్ తీగలకు అడ్డంగా పెరగడంతో నరికి వేసిన చెట్లు

- విద్యుత్ లైన్‌కు సమీపంలో ఉన్న చెట్లను నరికివేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు
- ముందే దూరంగా నాటితే ఈ పరిస్థితి రాదంటున్న వనసంరక్షకులు

మోర్తాడ్: హరితహారం కార్యక్రమం అమలు సమయంలో అధికారులు ముందుచూపు లేకపోవడంతో చెట్లకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. రోడ్లకు ఇరువైపులా చెట్లు పెంచి వేసవిలో నీడను అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఘోరమైన దెబ్బ తగులుతుంది. మోర్తాడ్ మండలంలోని వివిధ గ్రామాలలో రెండు, మూడు రోజుల నుంచి రోడ్లకు ఇరువైపులా పెంచిన మొక్కలు, చెట్లను విద్యుత్‌శాఖ సిబ్బంది నరికి వేస్తున్నారు. విద్యుత్ తీగలకు తగిలేలా పెరిగిన చెట్ల కొమ్మలనే కాకుండా, చెట్లను సైతం పూర్తిగా నరికి వేస్తున్నారు. విద్యుత్ లైన్‌కు దూరంగా మొక్కలను పెంచి ఉంటే చెట్లను నరికి వేయాల్సిన పరిస్థితి రాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అలాగే వడ్యాట్ నుంచి బషీరాబాద్ వెళ్లే మార్గంలో రోడ్డు వెడల్పు కారణంగా చెట్లను వేళ్లతో సహా పెకిలించి వేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు మొక్కలే నాటడంపై ముందుచూపు ఉంచి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



వడ్యాట్ శివారులో రోడ్డు విస్తరణ కోసం తొలగించిన చెట్లు

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో శనివారం హనుమాన్ జయంతిని ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా అన్ని మండలాలు, గ్రామాల్లోని అంజన్న ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం హనుమాన్ మాలధార స్వాములు, భక్తులు భారీగా తరలివచ్చి వీర హనుమాన్ విజయయాత్ర, శోభాయాత్రలు నిర్వహించారు. పలు గ్రామాల్లో స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. –సాక్షి నెట్‌వర్క్



ఆర్మూర్‌లో హనుమాన్ విజయయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, ప్రజలు



బాల్కొండలో శోభాయాత్రలో పాల్గొన్న సునీల్‌రెడ్డి, ఈరవత్రి అనిల్



బేల్యానాయక్ తండాలో పూజలు నిర్వహిస్తున్న బాన్సువాడ ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి



రుద్రూర్‌లో హనుమాన్ ఆలయం వద్ద ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు



జెండాగల్లీ హనుమాన్ ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న వినయ్‌రెడ్డి



ఆర్మూర్‌లో హనుమాన్ ఆలయం వద్ద అన్నదానంలో పాల్గొన్న భక్తులు



వర్నిలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు





మామిడిపల్లి హనుమాన్ ఆలయంలో.. తుంగినిలో పూజలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్, డీసీవోలు



రుద్రూర్‌లో..



పడగల్‌లో..



రెంజర్లలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో ..







ఆలూర్‌లో వీర హనుమాన్ విజయయాత్రలో పాల్గొన్న హనుమాన్ మాలధారులు.. నవీపేటలో పూజలు చేస్తున్న స్వాములు.. కందకుర్తిలో: అన్నదానం



బోధన్‌లో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న అధికారులు, నాయకులు



బోధన్‌లో హనుమాన్ భక్తుల సందడి



ఆర్మూర్‌లో హనుమాన్ శోభాయాత్రలో ఏర్పాటు చేసిన దేవుళ్ల ప్రతిమలు



శోభాయాత్రకు భారీగా హాజరైన హనుమాన్ భక్తులు

రసవత్తరంగా కుస్తీ పోటీలు



కొల్లూర్‌లో కుస్తీ పడుతున్న మల్లయోధులు

రుద్రూర్/పోతంగల్: రుద్రూర్ మండలం అంబం (ఆర్) గ్రామంలో, పోతంగల్ మండలం కొల్లూర్ గ్రామంలో శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీల్లో పాల్గొనడానికి సమీప గ్రామాల నుంచి మల్లయోధులు భారీగా తరలివచ్చారు. విజయం సాధించడానికి హోరాహోరీగా తలపడ్డారు. విజేతలకు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, నాయకులు బహుమతులు అందజేశారు.

నవీపేట: మండలంలోని అభంగపట్నం గ్రామంలో చివరి కుస్తీలో తలపడి, విజయం సాధించిన మల్లయోధుడికి 2 తులాల వెండిని బహుమతిగా అందజేశారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ తాలూక కర్కేలీ గ్రామానికి చెందిన వికలాంగుడు గణేష్ శెట్టివార్ పోటీలో తలపడి ప్రత్యర్థిని ఓడించాడు. కుడి చేయి లేని మల్లయోధుడు ప్రత్యర్థిని ఓడించగా రూ. వెయ్యి ప్రోత్సాహక బహుమతిని అందించారు.



రుద్రూర్ మండలం అంబం (ఆర్) గ్రామంలో..



అభంగపట్నంలో ఒంటి చేతితో కుస్తీ పడుతున్న గణేష్ శెట్టివార్

ఆధ్యాత్మికం..

■ వైభవంగా ఎల్లమ్మదేవి కల్యాణోత్సవం



రుద్రూర్: మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మదేవి ఆలయంలో శనివారం అమ్మవారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు బోనాలు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం శోభాయాత్ర నిర్వహించారు.

■ మల్లన్న ఉత్సవాలు ప్రారంభం

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామంలో మల్లన్న ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా భక్తులు మల్లన్నకు పల్లకీసేవ నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

■ వీరభద్ర ఆలయంలో అగ్ని గుండం



వర్ని: పాతవర్నిలో వీరభద్ర స్వామి భద్రకాళి అమ్మవారి కల్యాణం సందర్భంగా శనివారం తెల్లవారు జామున అగ్ని గుండం ఏర్పాటు చేశారు. అగ్నిగుండం నుంచి ప్రజలు నడిచి భక్తిని చాటుకున్నారు. గ్రామస్తులున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

వేల్పూర్: మండల కేంద్రంలో శనివారం అంబేడ్కర్ మాదిగ ఉపకులాల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బక్కొల్ల ప్రశాంత్ కుమార్, ఉపాధ్యక్షుడిగా కొండ్లెపు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా నల్లూరి వీరేందర్, కోశాధికారిగా కలిగోట మదన్, సంయుక్త కార్యదర్శులుగా నల్లూరి కేతన్, కత్తి రవీందర్, సలహాదారులుగా నల్లూరి విజయ్, కాకి అఖిలేష్, క్రీడా కార్యదర్శులుగా కాకిరాము, ఎర్రొల్ల భాను ఎన్నికయ్యారు.



సంక్షిప్తం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పలు బాధిత కుటుంబాలకు శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి అందజేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, మారుతిరెడ్డి, అలీ, చిన్నారెడ్డి, సలీం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రయాణ భత్యం మంజూరు



కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులకు ప్రయాణ భత్యం మంజూరైనట్లు హెచ్ఎం రామ్‌ప్రసాద్ తెలిపారు. కొత్త చెరువుతండా నుంచి 14మంది కోనాపూర్ పాఠశాలకు వెళ్తున్నారు. ఇందుకు గాను ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ. 6వేల చొప్పున ప్రయాణ భత్యం మంజూరు చేసింది. శనివారం విద్యార్థులకు భత్యం తాలుకు డబ్బులను పంపిణీ చేశారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ..



బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన ఓ బాధితుడి వైద్య చికిత్స కోసం రూ. లక్ష పదివేల ఎల్‌వోసీని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మంజూరు చేయించారు. సంబంధిత కాపీని శనివారం బాధిత కుటుంబానికి ఆయన అందజేశారు.

సినిమాలు

పీబీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి (తెలుగు) – 10.00, 1.05, 7.15, 10.20, ఫలక్‌నుమా దాస్(తెలుగు)-4.10
స్క్రీన్-2	జాక్(తెలుగు)-10.50, 1.45, 4.40, 7.35, 10.30
స్క్రీన్-3	ద మమ్మీ (తెలుగు)-12.20, 2.50, 5.20, 7.50, 10.20
స్క్రీన్-4	గుడ్‌బ్యాడ్ అగ్లీ (తెలుగు)-10.30, 1.25 7.05, 10.0, మ్యాడ్ స్క్వేర్(తెలుగు) -4.20

మాంసం ధరలు(రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800